

కాలనీలో శుభ్రతకు ప్రత్యేక చర్యలు

-ప్రజాశక్తి కథనంపై స్పందన



మందును పిచికారి చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చిలకపాడు జగనన్న కాలనీలో పారిశుధ్య పనులకు అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీ దుస్థితిపై 'ముంపు' నుంచి కాపాడాలి' అని ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై పంచాయతీ కార్యదర్శి చోళ్ళ రాజు స్పందించారు. కాలనీలో వ్యాధులు ప్రబలకుండా, పాములు, పుట్ల ఇళ్లలోనికి రాకుండా నిర్మూలించేందుకు కాలనీలో కలుపు మందు పిచికారి చేసి, బ్లీచింగ్ చల్లినట్లు ఆయన తెలిపారు.

ప్రయివేటుకు ఫిట్‌నెస్ తగదు

- అఖిల పక్ష సమావేశంలో నాయకులు
- 1న 'చలో రాజానగరం' జయప్రదానికి పిలుపు
- నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రవాణా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ప్రయివేటు సంస్థలకు అప్పగించడం తగదని, దీని వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే ఆ విధానాన్ని ఉప సంహరించుకోవాలని అఖిల పక్ష సమావేశంలో నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెఎసి కన్వీనర్గా వ్యవహరిస్తున్న ఐఎఫ్‌టియుసి జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్లో శనివారం అఖిల పక్ష పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, మార్గాని భరత్‌రామ్, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, డిసిసి అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌పిసి వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, పలు కార్మిక సంఘాలు, వివిధ యూనియన్ల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. జులై 1న నిర్వహిస్తున్న 'చలో రాజానగరం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సెగ తగిలేలా ఈ ఫిట్‌నెస్ విధానాన్ని రద్దు చేసే వరకు ఉద్యమించాలన్నారు. గుజరాత్ రాష్ట్రం తరహాలో ఎటిఎస్ సెంటర్ లేదా ఎంవిఐ వద్దకే ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించుకునేలా వెసులుబాటు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఏడాది కావస్తున్నప్పటికీ రవాణా రంగ కార్మికులకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు చేతల్లోకి మారేలా ప్రభుత్వం రవాణా కార్మికుల పట్ల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రవాణా కార్మికులకు సంబంధించి త్వరలోనే ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నానన్నారు. రవాణా కార్మికులకు ఉపశమనమైన న్యాయ సాయం అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు భాగస్వామిగా పనిచేస్తానని భరోసా ఇచ్చారు. ఎపిలో ప్రయివేటీకరణ విధానాన్ని ఉప సంహరించుకునే వరకు ఆందోళన చేయడానికి అందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కన్వీనర్లు వాసంశెట్టి, బాక్స్ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ తరఫున తాము ఆందోళన చేపట్టడం లేదని అందర్నీ కలుపుకుని జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఉద్యమాన్ని మొదలు పెట్టామన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడితే చలో రాజానగరం కార్యక్రమాన్ని ఉప సంహరించుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి పవన్, జిల్లా కార్యదర్శి బి పూర్ణిమ రాజు మాట్లాడుతూ చలో రాజానగరం కార్యక్రమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నాయకులు కె రామ్ రమణ, వైసిపి నాయకులు నరేంద్రారెడ్డి, డి.వి.రెడ్డి, ఐఎన్‌టియుసి ఉభయ రాష్ట్రాల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.నారాయణరావు, ఎం.సత్యనారాయణ, పి.నాగేశ్వరరావు, సప్పా ఆదినారాయణ, టి.లక్ష్మీనరసింహారావు ద్రవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి టి అరుణ్



సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్

రవాణా రంగంలో ఫిట్‌నెస్ ప్రయివేటీకరణ విధానాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. జులై 1న అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజానగరం కార్యక్రమానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. రవాణా వాహనాలకు ఫిట్‌నెస్ ప్రయివేటీకరణతో కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రవాణా రంగ కార్మికులపై పెను భారం మోపిందన్నారు. ఫిట్‌నెస్‌ను ప్రయివేటీకరించడంతో కార్మికుల జేబులు కొల్లగొట్టే విధానానికి తెర లేపారని వివరించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లోనూ ఈ విధానం లేదన్నారు. దీనికి భిన్నంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేయడం సరైంది కాదన్నారు. నైపుణ్యం లేని వారి ద్వారా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించడం సమంజసం కాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ముప్పిడి

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కొవ్వూరు

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటం ప్రభుత్వం పని చేస్తుందని ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎంఎల్ఎగా ఎన్నికైన నాటి నుంచి నేటి వరకూ నియోజక వర్గంలో మూడు విడతలుగా మెగా జాబ్ మేళా నిర్వహించి 1200 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రస్తుత జాబ్ మేళాలో సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు కంటమణి రామకృష్ణ, ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మురళి, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్మెంట్ అధికారి పావని, కోఆర్డినేటర్ సత్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - సీతానగరం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ బత్తుల

మండలంలోని సీతానగరం - తొర్రేడు మీదుగా రఘుదేవపురం వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్డు, కల్వర్టు పనులను శనివారం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తొర్రేడు నుంచి చిన్నకొండెపూడి వరకు రోడ్డు మంజూరైనప్పటికీ, సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయని అన్నారు. దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. తాను ఎంఎల్ఎగా నెగ్గిన తరువాత అధికారులు, కాంట్రాక్టర్లతో పలుమార్లు సమీక్షించి వారం రోజుల్లో పనులు ప్రారంభించి మూడు నెలల్లో పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చిన్నకొండేపూడి నుంచి చీపురుపల్లి, రాజానగరం నుంచి గాదరాడ, చిన్నకొండేపూడి నుంచి ముగ్గళ్ల రోడ్డు నిర్మాణానికి ఎన్‌డిబి నిధులు మంజూరైనప్పటికీ, గత ప్రభుత్వంలో బిల్లులు రాకపోవడం వల్ల పనులు చేపట్టలేదని వివరించారు. ఈ రోడ్డు పనులన్నీ త్వరలో పున్ణప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానం చెరువుకు వేలం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కానూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్మశానం చెరువుకు మూడేళ్ల కాలం పరిమితికి వేలం పాటను శనివారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ విస్తరణ అధికారి సిహెచ్ వెంకటరమణ, సర్పంచ్ భావన మధుచందు ఆధ్వర్యంలో పాటను నిర్వహించారు. గతంలో రూ.4.53 లక్షలకు పాట వెళ్ళగా శనివారం నిర్వహించిన వేలంలో రూ.13.05 లక్షలకు వెళ్లింది.



భూసేకరణ నష్టపరిహారంపై డిప్యూటీ కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం 2017లో సేకరించిన భూములకు సంబంధించి, ఇంకా నష్టపరిహారం అందని రైతుల సమస్యలపై శనివారం కెఆర్ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి సమీక్షించారు. శనివారం రామచంద్రపురం పిఎసిఎస్ భవనంలో జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పురుషోత్తపట్నం, చిన్నకొండేపూడి, నాగంపల్లి గ్రామాలకు చెందిన బాధిత రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన ఫైళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఎకరాకు సుమారు రూ.40 లక్షల పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని వివరించారు. దీనికి రైతులు అంగీకరించారు. నష్టపరిహారం ఈ స్థాయిలో ఉంటే రైతులు ఆర్థిక స్థితి మెరుగుపడుతందని అభిప్రాయపడ్డారు. సమావేశానంతరం డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ రెడ్డి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. పథకం పురోగతి, ప్రస్తుత పరిస్థితిపై అక్కడి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

వికసిత్ భారత్‌తో సుస్థిర ఆర్థిక వ్యవస్థ

ప్రజాశక్తి - రాజానగరం

వికసిత్ భారత్‌తో సుస్థిర ఆర్థిక వృద్ధిరేటు సాధ్యపడుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు, మిస్సైల్ శాస్త్రవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వికె.సారస్వత్ అన్నారు. శనివారం మండలంలోని గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ సహకారంతో 'వికసిత్ భారత్-2047 కోసం పరిశోధనలు, నవీకరణ'పై జరిగిన సదస్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ డిజిటల్ ఎకానమీపై దృష్టి సారించాలని అన్నారు. 2030 నాటికి ఒక ట్రిలియన్ డిజిటల్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధా మొదలైన అంశాలలో పరిశోధన ద్వారా స్వయం సమృద్ధి సాధించి ఆత్మ నిర్భర భారత్‌గా మారవచ్చని చెప్పారు. ఆరోగ్య రంగంతో పాటు అనేక అంశాలలో స్వయం సవృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. మన దేశ జిడిపిలో 62 శాతం సేవల రంగం నుంచి వస్తుంటే, కేవలం 14 శాతం మాత్రమే తయారీ రంగం ద్వారా వస్తోందని అన్నారు. ఇదే ఒక ప్రధాన సమస్యగా ఉందని చెప్పారు. జిడిపిలో పరిశోధన రంగం (ఆర్ అండ్ డి)పై చైనా 2.6 శాతం, దక్షిణ కొరియా 4.9 శాతం, ఇజ్రాయిల్ 6.3 శాతం ఖర్చు చేస్తుంటే, మనం దేశం కేవలం 0.64 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నందన్నారు. 2047 నాటికి 100 గిగా వాట్ల అణు శక్తి అవసరం ఉందని, న్యూక్లియర్ సైన్స్ చదివినవారికి మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వలన 2014లో ప్రపంచ ఇన్నోవేషన్ ఇండెక్స్ (జిఐఐ)లో 76వ స్థానంలో ఉన్న మన దేశం ప్రస్తుతం 39 వ స్థానానికి చేరిందన్నారు. 2023లో గంటకు మూడు చొప్పున స్టార్ట్ అప్స్ నమోదైతే, ప్రస్తుతం 118 యునికార్న్ స్టార్ట్ అప్‌లు ఉన్నాయని తెలిపారు. దీనిలో జిజియు ఛాన్సలర్ కెవివి.సత్యనారాయణరాజు, ప్రో ఛాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ, వైస్ ఛాన్సలర్ డాక్టర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ కెవిబి.రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ, ఆర్ అండ్ డి అడ్వైజర్ ప్రొఫెసర్ శిశిర్ సాహు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సారస్వత్

ధాన్యం బకాయిల కోసం రైతుల నిరసన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కొనుగోలు చేసిన ధాన్యానికి చెందిన బకాయి సొమ్ముల కోసం రైతులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాలకు రైతులు ఆందోళనకు దిగారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సూర్యారావుపాలెం, పసలపూడి గ్రామాలకు చెందిన రైతు సేవా కేంద్రాల పరిధిలో సుమారు 600 మంది రైతులు ధాన్యాన్ని విక్రయించారని తెలిపారు. ఆయా రైతులకు ప్రభుత్వం నుంచి సుమారు రూ.8 కోట్ల బకాయి సొము రావాల్సివుందన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసి రెండు నెలలు కావస్తున్నా నేటికీ చెల్లించలేదని విమర్శించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం రెండు నెలలు కావస్తున్నా వేయకపోవడం దారుణమన్నారు. ఖరీఫ్ సాగు చేపట్టాలంటే పెట్టుబడి అవసరమని, తమకు రావాల్సిన బకాయిలు రాకపోతే ఖరీఫ్ సాగు ఎలా చేపట్టాలని ప్రశ్నించారు. తక్షణమే రైతులకు చెల్లించాల్సిన బకాయి సొమ్మును తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కార్టూ'నిజం'



కార్పొరేట్ స్థాయి విద్య రవీంద్ర విద్యానికేతన్ సొంతం



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలో నగరంలోని రవీంద్ర విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో కార్పొరేట్ స్థాయి విద్యను తక్కువ ఫీజులకే అందిస్తున్నామని స్కూల్ ఛైర్మన్ డివి.స్వామిరెడ్డి తెలిపారు. మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ఆంగ్ల విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో 1989లో తమ విద్యా సంస్థను స్థాపించామని తెలిపారు. 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో తమ స్కూల్ విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారని తెలిపారు. ఎస్ఎస్‌సి 2025 ఫలితాల్లో 96 మంది విద్యార్థులు ఎ-గ్రేడ్ సాధించారని, 53 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించారని వివరించారు. చదువుతో పాటు ఆట పాటల్లోనూ తమ విద్యార్థులు ముందుండేలా ప్రత్యేక శిక్షణిస్తున్నామని తెలిపారు. అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన అందిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు నిరంతర పర్యవేక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ప్రత్యేక పద్ధతుల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా శిక్షణ అందిస్తున్నామన్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. డాక్టరు, ఇంజినీర్లు, టీచర్స్, బ్యాంక్ ఆఫీసర్స్ తయారుచేయడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని చెప్పారు. తక్కువ ఫీజులు తీసుకుంటూ ఉన్నత విద్యను అందిస్తున్న ఏకైక సంస్థ రవీంద్ర విద్యానికేతన్ అన్నారు. రాజమహేంద్రవరంలో బెస్ట్ స్కూల్ అవార్డు వరుసగా రెండుసార్లు వచ్చిందని తెలిపారు. ఐఎఎస్ కోచింగుకు తమ విద్యార్థికి ఫ్రీ సీటు రావడం గర్వకారణమన్నారు.







:: పాఠశాల ప్రత్యేకతలు ::

- కార్పొరేట్ స్థాయి విద్య
- విశాలమైన ఆట స్థలం
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- ఐఐటి ఫౌండేషన్ శిక్షణ
- ఉచిత కంప్యూటర్ డిజిటల్ క్లాసెస్
- క్వాలిఫైడ్, ఉపాధ్యాయులు అనుభవజ్ఞులైన
- మేనేజ్‌మెంట్ నిరంతర పర్యవేక్షణ
- అబాకస్, వేదిక్ మ్యాథ్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- హైదరాబాద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండేళ్ల ఫ్రీ సీట్లు సాధించిన విద్యాసంస్థ

రత్నం కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - కడియం

మండలంలోని బుర్రిలంక గ్రామానికి చెందిన నర్సరీ రైతు రత్నం వెంకట రామారావు(బాబులు) కుటుంబాన్ని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ శనివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బాబులు మృతి చెందారు. ఈ నేపథ్యంలోనే ఆయన కుటుంబ సభ్యులు రత్నం సూరిబాబు, అసోసియేషన్ ట్రెజరర్ రత్నం బాబ్జిలను మంత్రి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తొలుత బాబులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప, మాజీ సర్పంచ్ గట్టి నరసయ్య, పాఠంశెట్టి రవి, మార్గాని ఏడుకొండలు, రత్నం కృష్ణమూర్తి, తాడాల గురుస్వామి, తిరుమలశెట్టి శ్రీను, అసోసియేషన్ డైరెక్టర్లు కొండేపూడి నాగు, మల్లు శివ, పుల్లా శ్రీను, నూనె ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి, దంత వైద్య సేవలు

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మురమండ గ్రామంలో మురమండ, దుళ్ల గ్రామాల ప్రజలకు ఆంధ్ర పేపర్ మిల్ సౌజన్యంతో శనివారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయ, రాజమహేం ద్రవరం రమా డెంటల్ ఆసుపత్రి వైద్యులు సంయుక్తంగా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, ఆంధ్ర పేపర్ మిల్స్ ఇడి ముకేశ్‌జైన్, ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ఎన్.జెస్సీ సుప్రియ, డాక్టర్ ఎన్.నాగసాయిమౌర్య, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లీష్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జులై 1 నుంచి 31 వరకు ఇంగ్లీష్ గ్రామర్ బేసిక్స్ మరియు స్పోకెన్ ఇంగ్లీష్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కె తెలిపారు. శనివారం కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణకు ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన గృహిణులు, డిగ్రీ డ్రాప్‌వుట్ విద్యార్థులు ఇందుకు అర్హులని తెలిపారు. అర్హులు ఇంగ్లీష్ విభాగంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9493848186, 7981862200 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీరామమూర్తి, ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ నూజిళ్ళ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

30 వరకే అధికలోడ్‌పై రాయితీ

ప్రజాశక్తి - చాగల్లు, ఉండ్రాజవరం

ఈ నెల 30వ తేదీ వరకూ మాత్రమే అధిక లోడ్‌పై రాయితీ అవకాశం ఉందని చాగల్లు మండల విద్యుత్ శాఖ ఎఇ ఎస్.త్రిమూర్తులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఉండ్రాజవరం మండలంలో వినియోగదారులు 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎఇ ఎం.రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

మెప్మా అర్బన్ మార్కెట్

ప్రజాశక్తి - నిడదవోలు

మెప్మా ఆద్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలకు సంబంధించిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను స్థానిక సంత మార్కెట్‌లో శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎ.జ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు సుజాత, సింధుమాధవి, ఆర్‌పిలు పాల్గొన్నారు.

పలువురికి తోట నరసింహం పరామర్శ

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం గ్రామంలో పలువురిని మాజీ మంత్రి, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ పరామర్శించారు. 15వ వార్డు మెంబర్ పదిలం అప్పారావు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని, బదిరెడ్డి సూర్యప్రకాష్ తనయుడు బదిరెడ్డి సాయిసందేశ్ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఈ పర్యటనలో జడ్‌పిటిసి దాసరి శ్రీరంగరమేష్, వైస్ ఎంపిపి మడికి మైనరబాబు, నాయకులు దాసరి చినబాబు, సుంకర రమణ, దాసరి తమ్మన్నదొర, సుంకర వీరబాబు, పాటి రాంబాబు, రావుల గణేష్‌రాజా, గుల్లా ఏడుకొండలు, సమ్మిట మోహన్, కర్రీ సురారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చిత్రాడ శివారు కాలువలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. ఎస్ఐ మణికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్రాడ గ్రామంలోని కాలువలో మృతదేహం ఉన్నట్లు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. మృతి చెందిన మహిళ కాకినాడ అమ్మవారిపురానికి చెందిన వై.శ్రీలాసూర్యకిరణ్‌గా గుర్తించామన్నారు. మహిళ భర్త చనిపోగా, కుమార్తె ఉందని, కుటుంబ గొడవలు నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిందని తెలిపారు. ఇంతలో కాలువలో మృతదేహం లభ్యమైందన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న సిఐ నరేష్‌కుమార్

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

కూనవరంలో జరిగిన ఒక చోరీ కేసును ఏడేళ్ల అనంతరం రాజోలు పోలీసులు చేధించారు. నిందితులను అరెస్టు చేసి శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. వివరాలను సిఐ నరేష్ కుమార్ వెల్లడించారు. 2018లో కూనవరంలో వెంకటేశ్వర ట్రేడర్ రైస్ మిల్లులో ఆరుగురు వ్యక్తులు ప్రవేశించి ఇన్‌కమ్ టాక్స్ అధికారులమని చెప్పి మిల్లు ఓనర్ రుద్ర రామకృష్ణారావును బెదిరించి చోరీకి పాల్పడ్డారు. బాధితుని ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేశారు దర్యాప్తు చేపట్టారు. కూనవరం కేసులో నిందితులు అయిన కేశనపల్లి చెందిన యడ్ల అరవింద్, గూడపల్లి పల్లిపాలెంకు చెందిన ఎస్.సందీప్, పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన నేలపూడి మురళీధర్, గూడపల్లికి చెందిన మెల్లేటి మణికంఠ ను శుక్రవారం శివకోడు హైవేపై తప్పించుకుంటుండగా రాజోలు ఎస్ఐ రాజేష్ కుమార్ తన సిబ్బందితో కలసి పట్టుకున్నారు. శనివారం వారిని రాజోలు సిఐ సమక్షంలో కోర్టులో హాజరు పరిచారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

విద్యార్థినుల అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని మలకపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. పాఠశాలకు చెందిన కండెల్లి గౌరీ ప్రియ, మెరుపు తేజస్విని విద్యార్థినిలు శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదని గౌరీ ప్రియ మేనమామ కొక్కిరపాటి చిన్ని, తేజస్విని తండ్రి మునీశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కూటమి నేతల జోరు..ప్రతిపక్ష నేతల హోరు...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో గడిచిన వారం అధికార, ప్రతిపక్ష నేతల పర్యటనలతో రాజకీయం వేడెక్కింది. అఖండ గోదావరి ప్రాజెక్టు ప్రారంభోత్సవం నేపథ్యంలో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరైన విషయం విధితమే. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రముఖులు ప్రస్తావించిన పవన్‌కళ్యాణ్, విద్యా వేత్త, సంస్కరణోద్యమ ఖడ్గధారి కందుకూరి వీరేశ లింగంను విస్మరించడం విమర్శలకు దారి తీసింది. ప్రగతి నిరోధక సనాతన ధర్మాన్ని నిరంతరం వల్లించే బిజెపి సరసన డిప్యూటీ సిఎం చేరటమే ఈ దుశ్చర్యకు కారణమని స్పష్టమవుతోంది. మరో వైపు తాజాగా పునాది పడిన ఈ ప్రాజెక్టు పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అయితే లక్ష్యానికి అనుగుణంగా అడుగులు పడాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ అధినేత్రి వైఎస్. షర్మిల పర్యటన ఆ పార్టీ శ్రేణులలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఎన్నికల అనంతరం తొలిసారిగా వచ్చిన షర్మిల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులతో సమావేశమై కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఆ పార్టీలో అన్ని కులాలకు అధిపత్యం ఇవ్వాలని హితవు పలికారు. ఇంకో వైపు ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి చంద్రబాబు వంచనపై జనంలోకి పట్టాలని, పార్టీ శ్రేణులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అయితే అధికార కోల్యాంగా జిల్లాలో ముఖ్యనేతలు ఇప్పటికే అనైక్యత వెంటాడుతోంది. ఆ పార్టీ రూపొందించిన కార్యక్రమాలను సైతం వేర్వేరుగా నిర్వహిస్తూ విమర్శలను ఎదుర్కొంటున్నారు. తాజా పిలుపును ఏ మేరకు ఐక్యతతో నిర్వహిస్తారో వేచి చూడాలి. మరోవైపు వామపక్షాల ఆధ్వర్యంలో అమెరికా- ఇజ్రాయెల్ కలిసి చేస్తున్న మారణ హోమానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనలు మిన్నంటాయి. అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు సామ్రాజ్యవాద విధానాలను ఎండగట్టారు.

ఉపాధి కూలీలకు వేతన వెతలు

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితి కారణం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విధితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. ఐదేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయిలు పెట్టడం పరిపాటిగా మారింది. తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కొనసాగుతున్న అడ్మిషన్ల దందా

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలలో అడ్మిషన్ల దందా కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా తూట్లు పొడుస్తున్నాయి. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు, అడ్మిషన్ ఫీజులు వసూలు జరుగుతోంది. అయినా విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవటం విమర్శలకు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ఎల్‌కెజి విద్యార్థికి కనీసంగా రూ.20 వేలు ఫీజులు వసూలు చేయటంతో పాటు పుస్తకాలు, బస్‌ఛార్జీల పేరుతో మరో



రూ.10 వేలు యథేచ్ఛగా యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. పదో తరగతి చదివించాలంటే పాఠశాలలు స్థాయిని బట్టి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వెచ్చించక తప్పడంలేదు. ఇంటర్మీడియెట్ కాలేజీ ఫీజులు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. నీట్, టార్గెట్ ఐఐటి తదితర పేర్లతో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష వరకూ వసూళ్లు జరుగుతోంది. ఉన్నతాధికారుల దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలని విద్యార్థి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యం బకాయిలు కోసం వేడుకోలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం బకాయిలు సుమారు రూ.200 కోట్లు నిలిచిపోవటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం రబీ ధాన్యం కొనుగోలులోనూ, కొనుగోలు చేసిన ధాన్యం నగదు చెల్లింపులోనూ రైతులు నష్టిటపోతున్నారని అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుత వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట సాగు ప్రారంభిస్తే వాతావరణ ప్రతికూలతలకు ముందే దిగుబడులు చేతికొస్తాయని రైతులు భావిస్తున్నారు. రైతుల ఆకాంక్షలకు తగ్గట్లుగా పెట్టుబడి సాయం చేయటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శలు వస్తున్నాయి. అన్నదాత సుఖీభవ ఇప్పటికీ అమలు చేయకపోవటం ఒక కారణం కాగా బకాయిలు చెల్లింపులపై చొరవ చూపించకపోవటం ప్రధాన కారణమని స్పష్టమతోంది. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి త్వరితగతిన రైతుల బకాయిలు చెల్లించాలి.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కౌలు రైతులకు రుణాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో 6వ జిల్లా సహకార అభివృద్ధి కమిటీ, జిల్లాస్థాయి అమలు మరియు పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. గతంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సహకార సంఘాల రికార్డులను క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యకలాపాలు నిర్వహించని, మనుగడలో లేని సొసైటీల విషయంలో ప్రభుత్వ మార్గదర్శకాలు, కో ఆపరేటివ్ సొసైటీ నిబంధనల మేరకు చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. నిబంధనలు పాటించని సొసైటీలను రద్దు చేసి, నగదు లావాదేవీలు, అనుబంధ రికార్డులు, ఇతర కార్యకలాపాలకు చెందిన రికార్డులు సీజ్ చేయాలని ఆదేశించారు. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు జూలై నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల యొక్క వ్యవస్థ నూరుశాతం కంప్యూటరైజేషన్ చేయడం జరిగిందని జిల్లా సహకార అధికారి ఎమ్ వి వెంకట రమణ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు అందించే డిసిసిబి బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు ఎందుకు ఇవ్వడం లేదని కలెక్టర్ ప్రశ్నించారు. పంట సాగుదారుల హక్కుల కార్డులు (సిసిఆర్‌సి కార్డులు) ఉన్నా, కోపరేటివ్ సొసైటీలలో సభ్యులుగా ఉన్న కౌలు రైతులకు ఖచ్చితంగా వ్యవసాయ రుణాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, జిల్లా మత్స్య అధికారి టి.నిర్మలాకుమారి, కాకినాడ, ఏలూరు డిసిసిబి అధికారులు, నాబార్డ్, ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అదనపు లోడుపై 50 శాతం రాయితీ

ప్రజాశక్తి - గోపాలపురం

ఎక్కువగా గృహ విద్యుత్ వినియోగిస్తున్న సర్వీసులపై ఉన్న అదరపు లోడును క్రమబద్ధకరించుకునేందుకు 50 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించిందని విద్యుత్ శాఖ ఎఇ డి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తల్లి, బిడ్డ మృతిపై విచారణ

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వేలచింతలగూడెం గ్రామానికి చెందిన వార లక్ష్మి రెండవ కాన్పు పురుడు పోసుకుంటూ ఈనెల 25వ తేదీన తల్లి, బిడ్డ ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటనపై డిప్యూటీ ఇమ్యునైజేషన్ అధికారి పి.కోమల, డిప్యూటీ డిఎంహెచ్ఒ జె. సంధ్య శనివారం విచారణ చేపట్టారు. మతురాలి కుటుంబ సభ్యులు నుంచి వివరాలు సేకరించారు. ఈ నెల 24న గోపాలపురం సిహెచ్‌సికి గర్భిణి వార లక్ష్మి వచ్చారు. 25 తేదీన డెలివరీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వైద్యులు పురుడు పోసేందుకు మత్తు ఇంజక్షన్ చేయగా గర్భిణి స్పృహ కోల్పోయింది. గర్భిణీకి సీరియస్‌గా ఉండడంతో వెంటనే ఆమెను హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రసవం కొరకు ఆపరేషన్ చేయగా తల్లి బిడ్డ మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ తల్లి బిడ్డ మృతిపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. తుది నివేదికను డిఎంహెచ్ఒకు నివేదిస్తామని తెలిపారు. ఈ విచారణలో అన్నదవరపేట పిహెచ్‌సి వైద్యులు స్వర్ణలత పాల్గొన్నారు.

తల్లీ, బిడ్డ మృతి బాధాకరం

పురుడు పోసే క్రమంలో తల్లీ, బిడ్డ మృతి చెందడం బాధాకరమని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. వేలచింతలగూడెం గ్రామంలో తల్లిని కోల్పోయి అనాధగా మిగిలిన కుమార్తెను, కుటుంబ సభ్యులను ఆయన శనివారం పరామర్శించారు. తల్లిని కోల్పోయి అనాధగా మారిన గీతమాధురికి రూ.4 లక్షలను గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఆ మొత్తాన్ని ఆమె పేరుపై బ్యాంకులో డిపాజిట్ చేసి ఉన్నత చదువులు చదివించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విల్లూరి రాంబాబు, కొర్లపాటి అన్నవరం, పరిమి జగదీష్, గంట మధు, జ్యేష్ఠ శ్రీనివాస్ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - గోకవరం

ఆదర్శ ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. నాలుగేళ్లు, రెండేళ్ల చదువులను పూర్తి చేసుకున్న పట్టభద్రులకు అతిథుల చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాధరావు మాట్లాడుతూ 2022 బ్యాచ్ విద్యార్థులు జెఎన్‌టియుకె పరిధిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన బ్యాచ్ అని తెలిపారు. కళాశాల ఛైర్మన్ కనకరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకి మొట్టమొదటి ప్రయివేట్ ఫార్మసీ కాలేజీగా ఆదర్శను 2003లో స్థాపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దాసరి తమ్మన్నదొర, డాక్టర్ బోస్, బత్తుల సత్తిబాబు, భక్తుల నానాజీ, దాసరి చిన్నబాబు, పసుమర్తి బుజ్జి, ముమ్మడి వరకు చిన్నబాబు, చోడిశెట్టి గోపి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు కొవ్వూరులో వైసిపి సభ

ప్రజాశక్తి - కొవ్వూరు

ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలపై బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం లాంఛనంగా ప్రారంభించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తలారి వెంకట్రావు తెలిపారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో లీటరరీ క్లబ్ కళ్యాణమండపంలో ఆదివారం సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి మెయిన్‌రోడ్డులో మురుగునీటి వ్యవస్థలపై అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. శనివారం పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ ద్వారా నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో ఈ చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. కొన్ని అక్రమ నిర్మాణాలపై హైకోర్టులో స్టే కొనసాగుతుందని, అందువలన వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని అధికారులు తెలిపారు.

ప్రపంచ నిరుపేదల దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి - నల్లజర్ల

ప్రపంచ నిరుపేదల దినోత్సవంపై ఆమెన్ ట్రస్ట్ ఆధ్వార్యాన శనివారం మండలంలోని కొత్త గూడెం, దూబచర్ల, ఘంటావారిగూడెం గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్య క్రమంలో స్వచ్ఛంధ సేవకులు జివివి.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆమెన్ ట్రస్ట్ నిర్వహకులు ఇవాంజలన్ అశోక్ పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన మాజీ ఎంఎల్‌ఎ తిప్పల

కడియం: మండలంలోని కడియపులంక ఈలిగోపాలం నర్సరీని మాజీ ఎంఎల్‌ఎ, రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ తిప్పల గురుమూర్తిరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ రైతు ఈలిగోపాలం పలు రకాల మొక్కలు, వాటి పెంపకం తీరుతెన్నులను వివరించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ విశాఖలోని తమ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పూర్తి ఆర్గానిక్ విధానంలో చేస్తున్న సేద్యంలో పలురకాల మొక్కలను కొనుగోలు చేసేందుకు తన కుటుంబ సభ్యులతో కలసి కడియం నర్సరీలకు వచ్చానన్నారు. అనంతరం గురుమూర్తి దంపతులను గోపాలం సత్కరించారు.